# తొందరపడ్డారో.. అంతే

పి.జయప్రకాశ్

## చిన్న మదుపరులకు ఇది పరీక్షా సమయం



స్టాక్ మార్కెట్ సూచీలు దాదాపు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. నిఫ్టీ గమనాన్ని ఒకసారి పరిశీలిస్తే, అక్టోబరు 2008లో 2250 పాయింట్ల కనిష్ఠ స్థితి నుంచి కేవలం రెండేళ్ల వ్యవధిలో రికార్డు స్థాయికి దగ్గరైంది. ఇప్పటికే 180 శాతం పెరిగి నూతన రికార్డును, నెలకొల్పే దిశగా ముందుకు సాగుతోంది. భారతీయ స్టాక్‌మార్కెట్ల చరిత్రలో ఇంత అనూహ్యంగా రికవరీ రావడం అరుదైన ఘట్టమే. ఈ నేపథ్యంలో విదేశీ సంస్థాగత మదుపుదార్లు (ఎఫ్ఐఐ), దేశీయ సంస్థాగత మదుపుదార్లు, భారత ఆర్థిక వ్యవస్థ.. తదితర అంశాలను పక్కన పెట్టి మార్కెట్‌ను కేవలం సాంకేతికాంశాలు, ఫండమెంటల్స్ ఆధారంగా విశ్లేషిస్తే ఆసక్తికరమైన అంశాలు కనిపిస్తాయి.

సాంకేతికంగా చూస్తే, ఫండమెంటల్స్ కన్నా ముందుగానే మార్కెట్ పరుగులు తీస్తున్నట్లు స్పష్టం అవుతోంది. అందువల్ల ఈ కీలకమైన తరుణంలో దీనికి మానసికంగా నిరోధం ఎదురయ్యే అవకాశం ఉంది. మార్కెట్ ఇక్కడ కాస్త ఆగి, కొంత ఊపిరి పీల్చుకోవడం కూడా ఆరోగ్యకరమే. ఆదాయాల పరంగా చూస్తే షేర్ల ధరలు వాటి విలువకు మించి పెరిగిపోయాయని అనిపిస్తోంది. కానీ నిజ విలువ ప్రకారం చూస్తే, పెద్ద ఖరీదేమీ కాదని, సమంజమైన ధరలోనే ఉన్నాయని తెలుస్తుంది. ఈక్విటీ నిధుల మీద లాభాలు (రిటర్న్ ఆన్ ఈక్విటీ) తక్కువగా ఉండటం వల్ల ఈ రెండిటి మధ్య తేడా కనిపిస్తోంది. కానీ ఒక్కో త్రైమాసికం గడిచే కొద్దీ ఆదాయాలు, లాభాలు పెరిగి షేర్ల ధరలు సరసంగా మారతాయి. పీఈ నిష్పత్తి కూడా తగ్గిపోతుంది. కాకపోతే ఇదంతా జరగడానికి ఆయిదారు నెలల సమయం అయినా పడుతుంది.

ఇది స్థిరీకరణ సమయం. మార్కెట్ ఇంకా పెరగడానికి ముందు ఒక స్థాయిలో బాగా స్థిరపడాలి. ఏమైనా ఆసాధారణ సంఘటనలు, పరిమాణాలు చోటు చేసుకుంటే తప్పించి నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ అయిన నిఫ్టీ 6000 పాయింట్లకు పది శాతం అటు ఇటుగా స్థిరపడవచ్చనిపిస్తోంది. మదుపరుల ఓపికకు, మానసిక సామర్థ్యానికి ఇది పరీక్షా సమయమే. ఎక్కువ ఇబ్బంది రిటైల్ మదుపుదార్లకేననడంలో ఎటువంటి సందేహం అక్కరలేదు. ఇంతకాలం మార్కెట్‌కు వెలుపల ఉన్న రిటైల్ మదుపుదారులు ఇప్పుడు షేర్ల ధరలు ఎకాఎకిన పెరగడం చూసి ఒక్కసారిగా బులిష్‌గా మారిపోయారు. షేర్లు కొనుగోలు చేయడానికి తొందరపడుతున్నారు. అత్యంత క్లిష్టమైన, మార్కెట్లో హెచ్చుతగ్గులు అధికంగా ఉండే ఈ తరుణంలో ఇటువంటి మదుపుదార్లు వారి పెట్టుబడి సొమ్మును పరిరక్షించుకోవడం ఎంతో అవసరమని గుర్తించాలి. దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టదలచుకున్న మదుపుదార్లు మాత్రం తమ పెట్టుబడిని అయిదు సమాన నెలసరి వాయిదాలుగా విభజించి అయిదు విడతలుగా నమ్మకమైన షేర్లు కొనుగోలు చేయడం ఉత్తమం. దీని వల్ల వారి షేర్ ధర సగటు తగ్గుతుంది.

బుల్ మార్కెట్ ప్రయాణం ఇప్పటికి దాదాపుగా యాభై శాతం పూర్తి అయింది. మిగిలిన ప్రయాణం ఎలా, ఎప్పుడు ఉంటుందనేది అత్యంత ఆసక్తికరం. తగినంత విశ్రాంతి అనంతరం బలం పుంజుకొని మార్కెట్ మళ్లీ పరుగు ప్రారంభిస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థ మాదిరిగానే దేశీయ స్టాక్ మార్కెట్లు కూడా అత్యంత కీలకమైన ఘట్టంలో ఉన్నాయి. ఇది ఏ విధంగా మలుపు తిరుగుతాయనేది గమనించడం అత్యంత ఆసక్తికరమైన విషయమని మదుపుదార్లు గ్రహించవలసి ఉంది.

(రచయిత ఆర్ఎల్‌పీ సెక్యూరిటీస్ డైరెక్టర్)